# సింగిల్ పేజి కథలు

## నాణానికి మరోవైపు

మా మేనమామ రఘురామయ్య అంటే నాకు ఒళ్ళు మంట. నాకెందుకో ఆయన పద్ధతులు నచ్చవు. దబ్బపండు ఛాయతో..పొందూరు ఖద్దరు బట్టల్లో..ఆజానుబాహుడు ఆరడుగుల విగ్రహం అయినందువల్ల హుందాగానే వుంటాడు. అయితే నాకు నచ్చనిదేమిటంటే ఆయన చుట్టుపక్కల వున్నవాళ్ళు ఆయన వస్తుంటే లేచి నుంచోడం..ఒదిగి ఒదిగి వుండడం..అడుగులకు మడుగులొత్తడం..ఓహ్... ఎంత చిరాగ్గా వుంటుందో..ఏంటా బానిసత్వం? మనిషి ముందు మనిషి ఒదిగి వుండడమేమిటి? ఈ విషయాలు మా మామయ్య భార్య జానకమ్మ దగ్గర కూడా కదిపేదాన్ని. అయితే ఆవిడ నవ్వి తోసిపారేసేది. నా కోపం తారాస్థాయికి చేరేది. ఇక మా అమ్మయితే సరేసరి.

"మా అన్నయ్య అంటే ఏమిటనుకున్నావు? మా అందరికీ పెద్దదిక్కు. మాకే కాదు ఊరందరికీ అంతే! అసలు పెద్దదిక్కు అంటూ ఒకరుంటే ఎంత ధైర్యంగా వుంటుందో నీకేం తెలుసు? మా గౌరవాభిమానాలు ఆ పెద్దరికానికే..నీ పిచ్చి పిచ్చి ఆలోచనలు కట్టిపెట్టి అణకువగా వుండడం అలవర్చుకో. పెద్దదానివి అవుతున్నావు" అని సున్నితంగా మందలించేది.

అబ్బే బానిసత్వానికి గౌరవాభిమానాలని పేరు పెట్టుకుని ఆత్మవంచన చేసుకోవడమొకటి. ఛీ...ఛీ..వీళ్ళు మారరు. అయినా ఇప్పుడు ఆ మహానుభావుణ్ణి ఎందుకు తల్చుకుంటున్నానంటే..రేపు మా ఊరు వెళ్ళబోతున్నాము. నేను రానుమొర్రో అంటే అమ్మ అస్సలు వినడం లేదు. అమ్మమ్మకు ఒంట్లో బాగుండడం లేదట. ఎంతోకాలం బ్రతకదట కూడా. అందుచేత ఇప్పుడు అర్జెంటుగా వెళ్ళి చూడాలి. నాకేమో అక్కడికెళితే మామయ్య కంటబడతాడు. కోపం నషాళానికంటుతుంది. అయినా తప్పదు. భరించాలి.

మేమెళ్ళేసరికి మామయ్య వసారాలో పడక్కుర్చీలో కూర్చుని పేపర్ చదువుకుంటున్నాడు. మమ్మల్ని చూసి లేచి ఆప్యాయంగా మా దగ్గరకొచ్చి ప్రయాణమెలా జరిగిందని కుశలమడిగాడు. అమ్మ బాగానే మాట్లాడింది కాని నేనస్సలు నోరు తెరవలేదు. మామయ్య అదేమీ పట్టించుకోకుండా "ప్రయాణ బడలికతో వున్నారు. హాయిగా విశ్రాంతి తీసుకోండి. నేనలా బయటకెళ్ళొస్తాను" అని అభిమానంగా నా తలనిమిరి వెళ్ళిపోయాడు.

మళ్ళీ మామూలే నా కంటికి మా మామయ్య నియంతలా..చుట్టూ వున్నవాళ్ళు బానిసల్లా కన్పించసాగారు. ఆ వాతావరణానికి దూరంగా వుండడం కోసం నా చిన్నప్పటి స్నేహితురాళ్ళ ఇళ్ళకి వెళ్ళి కబుర్లతో కాలక్షేపం చేసేదాన్ని.

ఒకరోజు మా పొలం మీదుగా సరోజ ఇంటికి వెళుతున్నాను. అంతలో మా పొలంలో పనిచేస్తున్న వీరయ్యకి పాము కరిచింది. అప్పటిదాకా శీనయ్య పట్టిన గొడుగు నీడలో నుంచుని పనులు పురమాయిస్తూ..అజమాయిషీ చేస్తూ నుంచున్న మా మామయ్య ఒక్క ఉదుటున వీరయ్య దగ్గరకెళ్ళి భుజానికేసుకుని ప్రభుత్వాసుపత్రివైపు పరిగెత్తాడు. సకాలానికి వైద్యం అందడంతో వీరయ్యకి గండం గడిచింది. వీరయ్య భార్యా పిల్లలని ఊరడించాడు. ధైర్యం నూరిపోశాడు మామయ్య. ఎప్పుడూ నిండుగా, గంభీరంగా వుండేవాడు..వీరయ్యకి అలా జరిగేసరికి కృంగిపోయాడు. ఇంట్లో వాళ్ళకి ఏదో జరిగినట్టు విలవిల్లాడిపోయాడు. పొద్దుపోయేదాకా ఆసుపత్రిలోనే వుండి..ఒకటికి రెండుసార్లు 'వీరయ్యకి ఇంకేం ఫర్వాలేదు' అని డాక్టర్ చెప్పిన మీదట..వీరయ్య భార్య చేతిలో డబ్బు నుంచి వీరయ్య పూర్తిగా కోలుకున్నాకే పనిలోకి పంపమని చెప్పి ఇంటికి వచ్చాడు.

అప్పుడర్థమయింది మామయ్య అంటే ఏమిటో...ఆయన చుట్టూ వున్నవాళ్ళు బానిసలు కారు ఆత్మీయులు. ఆయన అభిమానం పొందినవాళ్ళు. అమ్మా, నాన్నల పట్ల మనం ప్రేమ, గౌరవం చూపిస్తాము ఎందుకు? వాళ్ళు మనల్ని కనిపెట్టుకుని వుంటారు కాబట్టి. ఒక పెద్దదిక్కుగా అందర్నీ ఆయన కనిపెట్టుకుని వుంటాడు. వాళ్ళ సుఖాలకి ఆనందిస్తాడు. కష్టాలకి కృంగిపోతాడు. అందుకే అందరికీ ఆయనపట్ల గౌరవంతో కూడిన భయం. అది ఆయన ప్రేమతో పొందుతున్నారు కాని అధిపత్యం చూసి..అజమాయిషి చేసి కాదు. నాణానికి మరోవైపుని స్పష్టంగా చూడగలిగాను.

ఊరి నుండి బయల్దేరేటప్పుడు మనస్ఫూర్తిగా..క్షమాపణ పూర్వకంగా మామయ్య కాళ్ళకి దండం పెట్టాను.

-ప్రతాప వెంకట సుబ్బారాయుడు
(సికింద్రాబాదు)

***

## చిన్ని చిన్ని ఆశ!

"యా..హూ" గట్టిగా పిడికిలి బిగించి గాలిలోంచి బలంగా తన వైపు లాక్కున్నాడు వసంత ఉత్సాహంగా!

ఎన్నో రోజుల నుండి ఊరిస్తున్న నల్లకళ్ళ అద్దాలు, రంగుల పెన్నులు కొనడం, పెప్సీకోలా త్రాగడం! కోర్కెలన్నీ ఈరోజు తీరబోతున్నాయి.

ఆనందంతో ఓ చోట నిల్చోలేకపోతున్నాడు.

స్నేహితులంతా కళ్ళద్దాలు పెట్టుకుని క్రికెట్ ఆడుతుంటే, అలాంటివి తనూ కొనాలని ఎన్నోసార్లు అనుకున్నాడు. దాని ఖరీదు పది రూపాయలే. అదే అతనికి గగనమైంది. పెప్సికోలా చల్లగా, మహా బాగా ఉంటుందని విన్నాడు. రుచి చూసే భాగ్యం ఇప్పటికి కలగబోతుంది.

పరిపరి ఆలోచనలతో ఉల్లాసంగా పాలిటెక్నిక్ ఎంట్రన్స్ పరీక్ష రాయడానికి బయలుదేరాడు వసంత్!

* * *

నలుగురు సంతానంలో మొదటివాడు వసంత్. కూలి ద్వారా వచ్చే డబ్బే వారి జీవనాధారం! అందువలన వసంత్‌కు పాకెట్‌మనీ ఉండదు. ప్రథమశ్రేణి విద్యార్థి, అతను. పై చదువులు తలకు మించిన భారమే అయినా, ఉపాధ్యాయుల ప్రోద్బలంతో పరీక్ష రాయించడానికి సిద్ధపడ్డారు అతని తల్లిదండ్రులు.

మెరిట్ స్కాలర్‌షిప్ రావడంతో, గైడుకు పరీక్ష ఫీజుకు సరిపోయింది. మాష్టారు సాయంతో స్వంతంగా ప్రిపేర్ అయ్యాడు. చార్జీలకు వంద రూపాయలు ఇచ్చి జాగ్రత్తలు చెప్పాడు తండ్రి. మాష్టారు దగ్గరకెళ్ళి వెళ్ళొస్తానని చెప్పాడు.

అన్ని జాగ్రత్తలు చెప్పిన తర్వాత "ఖర్చులకు ఈ యాభై ఉంచు వసంత్!" అన్నారు మాష్టారు.

"వద్దు సార్! నాన్న ఇచ్చారు" మొహమాట పడ్డాడు వసంత్!

"పరవాలేదు..తీసుకో!" అంటూ జేబులో ఉంచేశారు ఆయన.

సరిగ్గా ఆ క్షణం నుంచే మొదలయ్యాయి అతనిలో ఆలోచనలు.

ఊహల్లో తేలిపోతూ బస్ ఎక్కాడు. దగ్గర్లో ఉన్న పట్టణానికి చేరుకున్నాడు. పరీక్ష రాయడానికి జిల్లా కేంద్రం వెళ్ళాలి.

బస్టాండ్ వెనుక రైల్వేస్టేషన్ ఉంది. దాన్ని చూడగానే ఆలోచనొకటి అతని బుర్రలో తలుక్కున మెరిసింది. బస్ కంటే రైలు చార్జి తక్కువని త్వరగా కూడా వెళ్తుందని స్నేహితులు అంటుంటే విని ఉన్నాడు. రైలు ప్రయాణానికే మొగ్గు చూపాడు.

టికెట్ తీసుకుని రైలు ఎక్కాడు. ప్రయాణం చాలా హాయిగా, ఉల్లాసంగా సాగింది. స్టేషన్ రాగానే దిగాడు. బద్ధకంగా వళ్ళు విరుస్తూ, చుట్టూ చూశాడు. దీర్ఘంగా గాలి పీల్చుకున్నాడు.

"ఎక్కడి నుండి వస్తున్నావు!" వెనుక నుంచి మాటలు వినిపించడంతో ఉలిక్కిపాటుగా తలతిప్పి చూశాడు.

ఎదురుగా టికెట్ కలెక్టర్. సమాధానం చెప్పాడు వసంత్!

"టికెట్ చూపించు" అన్నాడు అతను. తీసి చూపించాడు వసంత్!

"పాసింజర్ టికెట్ కొని, ఎక్స్‌ప్రెస్ ఎక్కావు..ఫైను కట్టాలి" దబాయించాడు.

అప్పటివరకు ఉన్న ఉత్సాహమంతా చేత్తో తీసేసినట్లు మాయమయింది. కత్తివేటుకు నెత్తురు చుక్క లేదు వసంత్ ముఖంలో.

"తెలియక ఎక్కాను సార్!" బిక్కముఖం వేసుకుని అన్నాడు.

"అందుకే, ఫైను కట్టాలి! జేబులో ఎంత ఉందో తియ్యి" బెదిరింపుగా అన్నాడు.

జేబులో ఉన్న డబ్బంతా తీసి అతని చేతిలో పెట్టాడు అమాయకంగా!

"ఇంటికెళ్ళడానికి చార్జీలకు డబ్బు లేదండి!" బెరుకుగా చెప్పాడు.

ఏమనుకున్నాడో, ఏమో కొంత మొత్తం తిరిగిచ్చాడు టికెట్ కలెక్టర్.

పెప్సీకోలా! నల్ల కళ్ళద్దాలు. రంగురంగుల పెన్ను అన్నీ ఎదురుగా నిలిచి గేలి చేస్తున్నట్లుగా అన్పించి బాధగా కళ్ళు మూసుకున్నాడు.

కనుకొనలలో నిలిచిన నీటి బిందువులను తుడుచుకుంటూ భారంగా బయటకు అడుగులేశాడు.

**-రమణ కాకర్ల (గుడిపాటిపల్లి)**

***

# హాబీ

అప్పటికి పదోసారి లేచి బాత్రూమ్‌లోకి వెళ్ళి కూర్చున్నాడు రంగారావు. ఎదురుగా టేబుల్ మీద తన మొట్ట మొదటి కవిత అచ్చయిన పత్రిక. దాని క్రింద తన అడ్రస్ సెల్‌ఫోన్‌తో సహా ప్రింటయింది. కచ్చితంగా ఆ కవిత చదివి ఆంధ్రదేశంలోని వేలాది సాహితీ పాఠకుల్లో ఒక్కరైనా తనకు ఫోన్ చెయ్యకపోతారా అనే ఆలోచన వచ్చాక మొదలైంది రంగారావుకి అసలు టెన్షన్.

నుదుటిమీద నరాలు ఉబ్బాయి. కళ్ళల్లో ఎర్రజీరలు తేలాయి. పదే పదే గోక్కోవడంతో టపాసు దెబ్బతిన్న కాకిలా తయారై జుట్టు రేగిపోయింది. మళ్ళీ లేచి బాత్రూమ్‌కు వెళ్ళబోయాడు.

అంతలో అతని నిరీక్షణ ఫలిస్తున్నట్టు ఫోన్ మురళీ రవంలా పలికింది.

శ్రీకృష్ణుడిలా దాన్ని అందుకుని "హలో" అన్నాడు. ఎంత బాగా అందామన్నా కీచు కంఠం ఆ గదిలో ప్రతిధ్వనించింది.

"హలో సార్! రంగారావుగారేనా మాట్లాడుతుంటా?"

"అవునండీ..యింతకీ మీరు.."

"నా పేరు పాపయ్య. హైదరాబాదు నుంచి మాట్లాడుతున్నానండీ"

"అలాగే! యింతకీ ఏమిటి విషయం?" బాధతో మెలికలు తిరుగుతూ అన్నాడు రంగారావు.

"నా పలకరింపు మిమ్మల్ని బాగా షేక్ చేసినట్టుందే!"

"అది సరే! ఇంతకీ ఫోను ఎందుకు చేశారండీ?" బాధని బలవంతాన ఉగ్గపెట్టుకుంటూ అన్నాడు రంగారావు.

"సార్! మీ కవిత 'మృతకళేబరం ఆత్మఘోష' చదివానండీ. చాలా చాలా బాగుంది. ఇటీజ్ సో నైస్..కంగ్రాట్స్"

"నిజంగా!" ఒక్క అరుపు అరిచాడు రంగారావు. ఆ ఆనందంలో లుంగీ తడిసి పోయిందీ కూడా గమనించే స్థితిలో లేడు.

"నిజంగా నిజం సార్! మీలాంటి కవిపుంగవుల పరిచయం యిలా ఫోనులో కావడం నా అదృష్టం"

"థాంక్సండీ" అన్నాడు రిలాక్స్‌డ్‌గా.

"మీ గురించి తెలుసుకోవచ్చా?"

"నేను మొదట్లో చిన్నా చితకా గేయాలు రాసేవాడినండీ. రాను రాను వచన కవిత్వంపై పట్టు పెంచుకున్నాను. అడపాదడపా ఏదో ఒక కవిత సంకలనంలో నా కవితలు ప్రచురితమవుతూనే ఉంటాయి. నా కవిత చదివి ఫోన్ చేసిన ఫస్ట్ పాఠకుడు మీరే? మీ గురించి చెప్పండి" అన్నాడు రంగారావు తడి లుంగీ అసహనంగా చూసుకుంటూ.

"నేను ఒక కాలేజీ ప్రిన్సిపాల్‌గా ఈమధ్యనే పదవీ విరమణ చేశానండీ. నా క్రింద పనిచేసిన వెధవల్లో ఒక్కడికీ ఈ సాహితీ అభిరుచి లేదంటే నమ్మండీ. కవిత్వం చదివి ఆనందించడం నా 'హాబీ'. మీ కవిత చదివాక ఫోన్ చేయకుండా ఉండలేకపోయాను. ఇలా ఎప్పుడైనా ఫోన్ చేస్తే మీకు ఇబ్బంది లేదు కదా?" అడిగాడు పాపయ్య.

"నో నాటెటాల్! థాంక్స్! చిన్న అర్జంటు పని ఉంది. పని చూసుకుని నేను ఫోన్ చేస్తాను" అన్నాడు రంగారావు.

"పది నిముషాల తర్వాత నేనే చేస్తాలెండి!" ఫోన్ పెట్టేశాడు పాపయ్య.

"అమ్మయ్యా" అనుకుంటూ తడి లుంగీతో బాత్రూమ్‌లోకి పరిగెత్తాడు రంగారావు.

మరునాడు- మళ్ళీ పాపయ్య ఫోన్.

"సార్! ఎలా ఉన్నారు? ఏమిటి విశేషాలు?"

"బాగానే ఉన్నాను. నిన్నటికీ ఈవేళ్టికీ విశేషాలు ఏముంటాయి?"

"ఈవేళ ఎన్ని కవితలు రాశారు?"

"ఇంకా ఏం రాయలేదండీ!"

"అదేంటండీ కత్తిలాంటి మీరు కనీసం పది కవితలైనా రాసేస్తారనుకున్నానే! మీ కవితలు ఏవైనా సంకలనంగా వేశారా?"

"అంత శక్తి నాకు లేదు సార్!"

"అరే మీరంత దీనస్థితిలో ఉన్నారా! రేపే మీకు అర్ధ నూట పదహార్లు డి.డి. తీసి పంపిస్తాను సరేనా?"

అది వెయ్యి నూటపదహార్లు అని వినపడి "ఓకే సార్! పంపండీ! మీ సహాయానికి థాంక్స్!" అన్నాడు రంగారావు.

"మళ్ళీ రేపు చేస్తాను సార్" ఫోన్‌పెట్టేశాడు పాపయ్య.

* * *

మరునాడు తన సమకాలీకుడు త్రినాథ్ యింటికి వెళ్ళాడు రంగారావు. నిజానికి ఆ టైమ్‌కి పాపయ్య ఫోన్ చేస్తానన్నాడు. అది తప్పించుకోవడానికే త్రినాథ్ దగ్గరకు వచ్చాడు రంగారావు.

త్రినాద్ ఎవరితోనో ఫోన్‌లో మాట్లాడుతున్నాడు.

రంగారావు త్రినాథ్ ఎదురుగా కుర్చీలో కూలబడ్డాడు.

"అలాంటి కవిత నేనొక్కడినే రాయగలను అని మీరు ఎంతో అభిమానంతో అంటున్నారుగానీ, నేనంత బాగా రాస్తానా?" అంటున్నాడు త్రినాథ్.

"మీలాంటి వారివల్లే ఈ సమాజంలో కుళ్ళు తుడిచిపెట్టుకుపోతుంది సార్! మీ పుస్తకాలు ఏవైనా ఉంటే పంపరూ? ఎంత రేటైనా పర్వాలేదు"

"ప్రస్తుతం ఏ పుస్తకమూ ప్రచురించలేదు సార్! వేశాక తప్పక పంపిస్తాను"

"నేనెవరికీ ఫోన్ చేయను సార్. మీ కవిత చదివాక ఫోన్ చేయకుండా ఉండలేకపోయాను. థాంక్స్ సార్. మళ్ళీ రేపుఫోన్ చేస్తాను" అనడంతో ఫోన్ పెట్టేసి రంగారావు కేసి తిరిగాడు త్రినాథ్.

"ఎవరయ్యా అంత ప్రేమగా మాట్లాడుతున్నాడు?" అడిగాడు రంగారావు.

"ఎవరో రిటైర్డ్ ప్రిన్సిపాలట. పేరు పాపయ్యట. మెంటల్ హాస్పటల్‌లో నైట్‌వాచ్‌మెన్‌గా చేరి వారం రోజులైందట. నేను వ్రాసిన కవిత చాలా చాలా బావుందట. ఎవరికీ ఫోన్ చేయడట. నాకు మాత్రమే ఫోన్ చేశాడట. ఈరోజుల్లో యిలాఫోన్ చేసి అభినందించే వాళ్ళు ఎందరుటారు చెప్పు!" మురిసిపోతూ చెప్పుకుపోతున్నాడు త్రినాథ్.

"ఆ!" అని క్రిందపడిపోయిన రంగారావుని ఎప్పుడు గమనిస్తాడు! రంగారావు ఎప్పుడు లేస్తాడు. ఆ భగవంతుడికే తెలియాలి!

**-గాదిరాజు రంగరాజు**

**(చెరుకువాడ)**

